

తారుమారు
శిల్పి
శృంగార వీధి
CHANDRA

**"మన జంటలు ఇలా కలుసుకోవడం చాలా చిత్రమైన విషయం."**

**"అఫ్‌కోర్స్, చిత్రమైనదనడంలో ఆశ్చర్యం ఏముంది? పేర్లలోనే కాదు, పూర్వపరిచయాల్లోనే కాదు, అన్నిటిల్లోనూ ఒక సామ్యం ఉంది. భలే తమాషాగా ఉంది. సినిమాల్లోనే ఇలా జరుగుతుం దనుకుంటాను."**

రామారావూ, శంకరం అలా అబ్బురపడడంలో వింత లేదు. వాళ్లిద్దరూ భార్యలతోసహా బెంగుళూరులోని బి.వి.కంపెనీ హాలిడేహోమ్‌లో కలిసేదాకా ఒకరి నొకరు ఎరగరు. కానీ చేరాక చూస్తే రామారావూ, శంకరం భార్య పార్వతీ ఇద్దరూ బి.వి.కంపెనీ విజయవాడ బ్రాంచ్‌లో రెండేళ్ల క్రితం కలిసి పనిచేశారు. అలాగే శంకరమూ, రామారావు భార్య సీత కాలేజీలో క్లాస్‌మేట్స్. రామారావుకీ, సీతకీ వారం క్రితమే పెళ్లయి హనీమూన్‌కి వచ్చేరు. శంకరమూ, పార్వతికి పెళ్లయి ఆర్నెల్లయినా పార్వతికింకా ట్రాన్స్‌ఫర్ రాలేదు శంకరం ఊరికి. అందుకే కంపెనీ హాలిడేహోమ్ ఉంది, ఖర్చు తక్కువలో సరదాగా గడపవచ్చు కదాని బెంగుళూరు వచ్చారు. వచ్చేక హైద్రాబాద్ నుంచి వచ్చిన రామారావు పక్క రూములో ఉన్నాడని తెలిసి చూడ్డానికి వచ్చింది పార్వతి. రెండు రోజులు కలిసి తిరగడంతో రెండు జంటలకి మంచి దోస్తీ ఏర్పడింది. ఆ చొరవతోనే రామారావు శంకరాన్ని విడిగా పార్కుకి పిలుచుకుపోయి సంభాషణ మొదలుపెట్టాడు.

"బయటకు కనబడే విషయాలు మాత్రమే కాదండీ, మనం క్లోజ్‌గా మూవ్ అవుతున్నాంకాబట్టి ధైర్యంచేసి చెప్పేస్తు న్నా. నిజానికి నేనూ, పార్వతీ ప్రేమించుకున్నాం. డోంట్ మిస్టేక్ మీ. జస్ట్ ప్లాటోనిక్ లవ్ మాత్రమే. శారీరకసంబంధం ఎన్నడూ లేదు. కులాలు వేరుకదా, పెద్దవాళ్లు పెళ్లికొప్పుకోరని పార్వతి వాదం. ఏంచేస్తామని ఊరుకున్నాను. ఫన్నీ థింగ్ ఏమిటంటే హనీమూన్‌కి భార్యతో వస్తే ప్రియురాలుకూడా కలవడం. విధివిలాసం అంటారు పెద్దవాళ్లు, ఇదేకాబోసు..."

శంకరం చాల ఎక్సైట్ అయ్యేడు. "రామారావుగారూ, మీ నిజాయితీ నాకు నచ్చిందండి. ఇంకో విషయంచెబితే మీరింకా ఆశ్చర్యపడతారు. మీ భార్య సీతా, నేనూ కూడా లవర్స్‌మే. మీలాగే జస్ట్, మనస్సులో మాత్రమే. ఫిజికల్ టచ్ లేదు. కాలేజీ రోజులు కదా, జీవితంలో సెటిల్ కాకుండా పెళ్లీ, సంసారం అంటూ ఏం మాట్లాడతాం? నిజానికి, ఇక్కడికి వచ్చి మా ఇద్దర్నీ చూశాకనే, నాకనిపించింది, సీతే నాభార్యయి వుంటే ఎలా వుండేదా, అని. మీరు మరోలా అనుకోకూడదు."

"నో ప్రాబ్లెమ్, హిపోక్రసీ అక్కర్లేదు సార్, మానసికవ్యభిచారం చేస్తాం. పైకి చెప్పగల దమ్ము ఉన్నది కొందరికే. కొందరు పెళ్లాల్ని మార్చుకుంటారని విని లొట్టలేస్తాం. పైకి మాత్రం ఛ,ఛ అంటాం. ఏం మనకు మాత్రం అలాటి ఐడియాలు రావా? వస్తాయి. కానీ మిడిల్‌క్లాస్ మొరాలిటీ అడ్డొస్తుంది..."

"రాకూడదుసార్, మీరు సరేనంటే. ఒక్క రోజు, రేదర్ ఒక్కరాత్రికి మనమూ ఆ అనుభవం ఎలాటిదోచూద్దాం. మన కేసులో ముక్కూ, ముఖం తెలీనివాళ్లతో పడుక్కోటంకాదు. మన మనస్సులో ఎన్నోఏళ్లగా నిండివున్న ప్రేమమూర్తులు వాళ్లు. వేరే వాళ్లతో పెళ్లయ్యాక ప్రేయసితో ఇదే అనుభవం ఎలా ఉండివుంటుందాన్న ఆలోచన దొలిచేస్తున్నప్పుడు, ఒక్కరాత్రి అలా సుఖించడంలో తప్పేముందండీ?"

"ఐ ఎగ్రీ విత్‌యూ. కానీ సీతా, పార్వతీ ఒప్పుకుంటారంటారా?"

వాళ్లిద్దరూ పార్కులో కూచుని చాలా జాగ్రత్తగా ప్లాను వేశారు. ఇద్దరి గదులూ పక్కపక్కన ఉన్నాయి. టాయిలెట్ కామనే. రెండు వాటాలలోంచి దాంట్లోకి రావచ్చు. 'లైటు ఉంటే నువ్వు సిగ్గుపడుతున్నావు. సరిగ్గా ఎంజాయ్ చేయలేక పోతున్నాం' అని భార్యలకు నచ్చచెప్పి రెండు బెడ్‌రూముల్లోను దీపాలు పూర్తిగా ఆపేయాలి. ఆ తరువాత అవసరం ఉందనిచెప్పి రామారావు బాత్రూమ్‌కి వెళ్లి గడియతీసి వుంచాలి. శంకరం కూడా అదే టైములో బాత్‌రూమ్‌కి వచ్చి, ఒకరి బెడ్‌రూమ్‌లోకి మరొకరు వెళ్లాలి. ఓ గంటపోయాక, మళ్లీ బాత్‌రూమ్‌కి వచ్చి లైట్ రెండుసార్లు ఆర్పి, వెలిగిస్తే ఆ సిగ్నల్ అందుకుని మళ్లీ అవతలివాళ్లు రావాలి. ఆ తర్వాత ఎవరి బెడ్‌రూమ్‌కి వాళ్లే...

"అంతా బాగానే వుందికానీ, వాళ్లకి తేడా తెలియదంటారా?" అని సందేహం వెలిబుచ్చాడు రామారావు.

"సార్, మీకు పెళ్లయి వారం కాలేదు. మాకు పెళ్లయి ఆర్నెల్లయినా పార్వతి కాపురానికి రాకపోవడంవల్ల, నాలుగు రోజులు వరసగా సంసారం చేసింది లేదు. ఎప్పటికప్పుడు కొత్తగానే అనిపిస్తుంది మాకు. శరీరాలు ఇంకా పరిచయం కా లేదుగా. మనిద్దరి పర్సనాలిటీ ఒకలాగే వుంటుంది. తేడా కనిపెట్టలేరు. గొంతుమాత్రం గుర్తు తెలుస్తుంది కాబట్టి మౌనంగా ఉంటేసరి. వాళ్లు మాట్లాడబోతుంటే 'ష్' అంటే సరి. కాస్త మందుకొట్టి ముద్దగా మాట్లాడితే రెండు మూడు మాటలాడినా కనుక్కోలేరు" అన్నాడు రామారావు.

000

'శంకరం వాదం కరెక్టే. పార్వతి కనుక్కోనే లేదు' అనుకున్నాడు రామారావు, సేదదీరుతూ. చిత్రమేమిటంటే ఆమె కూడా మాటలకంటే చేతలకే ప్రాధాన్యమిచ్చింది. అసలు మాట్లాడిందా, లేదా అన్నవిషయంకూడా గుర్తుకు రాలేదు. అంతలో అతనికో ఆలోచన వచ్చింది. అప్పటిదాకా ఆ ఆలోచన రానందుకు సిగ్గేసిందికూడా. 'ఎంతసేపూ తనయావేనా? పార్వతి మాత్రం తనగురించి తపించలేదా? తనతో రమించడం ఆమెకు మాత్రం ఆనందదాయకం కాదా? భయంకొద్దీ, బెరుకుకొద్దీ మగాళ్లలా ఆమె బయట పడకపోవచ్చు. కానీ ఇప్పుడంతా అయిపోయిందిగా! ఇప్పటి దాకా తన వలపు దోచుకున్నది ప్రియుడని తెలిస్తే ఆమె మాత్రం సంతోషించదూ?'

ఏమైతే అదే అయిందని, కౌగిలి విడిపించుకొని, చేయిచాచి సడన్‌గా బెడ్‌రూమ్‌లో లైట్ వేసేశాడు. నగ్నంగా వున్న పార్వతి దుప్పటి చటుక్కున పైకి లాక్కోడం చూసి, నవ్వుతూ ఏదో అనబోయిన రామారావు కొయ్యైపోయాడు.

అక్కడ ఉన్నది పార్వతి కాదు, సీత! సీతకూడా తెల్లబోవడం చూసి, మరింత తెల్లబోయాడు రామారావు. భయపడుతూనే అసలు విషయం చెప్పేసింది సీత. పార్వతీ, తనూ తమ తమ ప్రేమ కథలు చెప్పుకున్నారుట. మగాళ్లకొచ్చినట్టే వాళ్లకీ ఐడియా వచ్చిందిట. చీకట్లో శృంగారం అనగానే, 'హమ్మయ్య' అనుకొని, రామారావు బాత్‌రూమ్ కెళ్లగా చూసి, మెయి న్‌డోర్‌లోంచి పార్వతిని పిలిచి, గదులు మారిపోదామంది. సై అందిట పార్వతి కూడా.

"పోన్లే, ఇలా జరగడంకూడా మంచిదే. భగవంతుడికి కూడా ఇష్టం లేదు మనం ఇలాటి వేషాలేయడం. పేర్లుకూడా కలిసేట్టు ఆయన కుదిర్చినజంటలు అలాగే ఉండాలని ఆయన ఉద్దేశ్యం కాబోలు. మనకిలాటివి ఇక ఒద్దులే" అని రామారావు సీతను దగ్గరకు తీసుకుని ఆర్తిగా కౌగలించుకున్నాడు. ⓟ